



పలివేల్పుల గ్రామంలోని రైతు వేదికలో..

మంత్రి తుమ్మల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు వర్ధన్నపేట రైతు వేదికలో హాజరైన కలెక్టర్ సత్య శారదా దేవి, ఏవో ఉషాదయాళ్, రైతులు

# రైతు భరోసా రూ.15వేలివ్వాలి

## అదునుకు ముందే అకౌంట్‌లో వేయాలి

'పెట్టుబడి సాయం పెంచి ఇస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలి, గత కేసీఆర్ సర్కారు ఎలా అయితే అదునుకు ఆసరా అయిందో అదే విధంగా జూన్ మొదటివారంలోనే బ్యాంకు అకౌంట్‌లో వేయాల'ని మెజార్టీ రైతులు కోరారు. 'రైతునేస్తం'లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళ వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా ఉమ్మడి జిల్లాలోని 12 రైతు వేదికల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయాధికారులు పాల్గొని రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా సాగుభూములన్నిటికీ రైతుభరోసా ఇవ్వాలని కొందరు, పదెకరాల వరకే అమలుచేయాలని, ఐటీ చెల్లించేవారికీ వర్తింపజేయాలని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఇక రియల్ ఎస్టేట్ భూములు, బీడు భూములకు, నకిలీ పట్టాపాస్ పుస్తకాలున్న వాటికి పెట్టుబడి సాయం ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే షరతులు లేకుండా ఒకే దఫాలో త్వరగా రుణమాఫీ చేయాలని కోరగా, సేకరించిన అభిప్రాయాలపై కేబినెట్‌లో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

- మహబూబాబాద్, ములుగు, జూన్ 25(నమస్తే తెలంగాణ)/నర్సంపేట/పరకాల/కాటారం/జనగామ రూరల్

- పదెకరాల వరకు అమలు చేయాల్సిందే
- ఐటీ చెల్లించేవారికీ వర్తింపజేయాలి
- రియల్ ఎస్టేట్ భూములకు ఇవ్వొద్దు
- మెజార్టీ అన్నదాతల అభిప్రాయమిదే
- ఒకే దఫాలో రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి
- అది కూడా షరతులు విధించకుండా ఇవ్వాలి
- 'రైతునేస్తం'లో మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్
- పాల్గొన్న కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, రైతులు
- సేకరించిన వివరాలపై కేబినెట్‌లో చర్చిస్తామని వెల్లడి



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఏటిగడ్డ తండా వద్ద రైతు వేదికలో రైతు భరోసా సమావేశంలో పాల్గొన్న రైతులు

రైతు భరోసా ఏడాదికి రెండుసార్లు పదెకరాల వరకు వర్తింపజేయాలని రైతులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మంగళవారం భూపాలపల్లి జిల్లాలో రేగొండ, కాటారం, ములుగు జిల్లాలో ములుగు, పేరూరు, జనగామ జిల్లాలో గానుగుపహాడ్, చాగల్, మహబూబాబాద్‌లోని ఏటిగడ్డతండా, నర్సింహులపేట, వరంగల్‌లో నర్సంపేట, వర్ధన్నపేట, హనుమకొండలో పలివేల్పుల, పరకాల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. నర్సంపేటలో 60 మంది రైతుల అభిప్రాయాలను వ్యవసాయ శాఖ అధికారులు రాతపూర్వకంగా తీసుకున్నారు. ప్రతి ఎకరాకు ఏటా జూన్‌లో రూ.7500, నవంబర్, డిసెంబర్‌లో రూ.7500 చొప్పున అకౌంట్లో వేయాలని రైతులు సూచించారు. నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్న వారికి డబ్బులు వేయొద్దు. రియల్ ఎస్టేట్ భూములకు రైతుభరోసా డబ్బులు ఇవ్వొద్దు. పదెకరాల భూముల కంటే ఎక్కువ ఉన్న వారికి కూడా పెట్టుబడి సాయం అందించొద్దు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లు రైతు భరోసా సాయం పెంచాలి. రైతులకు ఎలాంటి షరతులు పెట్టొద్దు. కౌలురైతులకు కూడా రైతు భరోసాను ఇవ్వాలి. ఐటీ కడుతున్న వారికి కూడా ఇవ్వాలి. బీడు భూములు, ప్లాట్లకు డబ్బులు ఇవ్వొద్దు. వీటిని గుర్తించి రైతు భరోసా నుంచి తీసేయాలి. తరి, ఖుష్కి భూములకు కూడా ఇవ్వాలని అన్నదాతలు వ్యవసాయ అధికారులకు తమ అభిప్రాయాలు తెలియజేశారు.

### జూన్ మొదటి వారంలోనే వేయాలి



హసన్‌పర్తి: రైతులకు పెట్టుబడి సాయం జూన్ మొదటి వారంలోనే ఎకరాకు రూ.15వేలు ఇస్తే మేలు జరుగుతది. సాగులో తీసుకునే జాగ్రత్తలను చెప్పాలె. విత్తనాలు, ఎరువులు, ట్రాక్టర్, వ్యవసాయానికి సంబంధించిన పరికరాలు 50 శాతం సబ్సిడీపై ఇస్తేనే రాబోయే రోజుల్లో వ్యవసాయం చేయడానికి రైతులు సిద్ధంగా ఉంటరు. లేకపోతే ఎవుసం చేసే పరిస్థితి ఉండదు.

– తోకల ఆదిరెడ్డి, సీతంపేట, హసన్‌పర్తి

### ఎకరానికి రూ. 15 వేలివ్వాలి



నర్సింహులపేట, జూన్ 25: ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు రూ. 2 లక్షల రుణామాఫీ చేయాలె. కుటుంబం, రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పంట రుణం తీసుకున్న ప్రతి రైతుకూ అందాలె. ప్రస్తుతం చెరువు, బావుల్లో నీళ్లు లేక వరి నారు పోసుకునేందుకు సైతం ఇబ్బందిగా ఉంది. పెట్టుబడి సాయం ఎకరానికి రూ. 15 వేల చొప్పున ఇయ్యాలె. సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ అందించాలె. ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతుకు కొంత మేరకు ఖర్చు తగ్గుతది. వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై అందేలా చూడాలి. కౌలు రైతుకు సైతం రైతు భరోసా ఇవ్వాలె.

– మంచాల శ్రీశైలం, పడమటిగూడెం, నర్సింహులపేట

### పదెకరాల వరకు 'భరోసా' ఇవ్వాలి



నర్సంపేట: రైతు భరోసాను పది గుంటల నుంచి పదెకరాల వరకు భూములు ఉన్న రైతులకు అమలు చేయాలి. ఈ పథకంలో రైతులు ఎంతో లబ్ధి పొందుతున్నారు. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. కొందరు చిన్న రైతులు కూడా ఐటీ కడుతున్నారు. ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలి. ప్రతి జూన్, నవంబర్, డిసెంబర్ నెలల్లో వ్యవసాయ పనుల ప్రారంభానికి ముందు రైతుల అకౌంట్లలో డబ్బులు వేయాలి. కౌలు రైతులను కూడా గుర్తించి పెట్టుబడి సాయం అందించాలి. లోటుపాట్లను సవరించి ఇవ్వాలి.

– మల్లాడి రవీందర్‌రెడ్డి, రాజపల్లె

### హామీ ప్రకారం పెంచివ్వాలి



నర్సంపేట : రైతు భరోసా పథకాన్ని రైతులకు హామీ ఇచ్చినట్లు అమలు చేయాలి. లొసుగులు లేకుండా సరిచేయాలి. ఖాళీ ప్లాట్లు, ఇళ్ల స్థలాలు, రియల్ ఎస్టేట్ భూములు, ఖాళీ జాగలు, బీడు భూములకు రైతు భరోసా ఇవ్వడం వల్ల డబ్బులు పక్కదారి పడుతున్నాయి. పదెకరాల వరకే రైతు భరోసా ఇవ్వాలి. రైతులకు రుణమాఫీ కూడా ఎంతో అక్కరకు వస్తుంది. రైతులకు రైతు భరోసాను కూడా పెంచి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ డబ్బులను కూడా వానకాలం, యాసంగి పంటల సాగుకు ముందే ఇస్తే మంచిది.

– మాలోత్ రమేశ్, తోపనగడ్డతండా

### ఐటీని లెక్కలోకి తీసుకోవద్దు



వర్ధన్నపేట: రైతులు ట్రాక్టర్లు, బైక్‌లు కొనుగోలు చేసే సమయంలో కొంతమేర ఐటీ చెల్లింపులు జరుగుతున్నాయి. దీన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని రైతు భరోసా, రుణమాఫీ వర్తింపజేయకపోవడం సరికాదు. ఇలాంటి విధానాలు అవలంబిస్తే రైతుల నుంచి తప్పకుండా ప్రతిఘటన వస్తది.

– వసంత్‌నాయక్, రైతు, డీసీతండా



పరకాలలో రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు



నర్సంపేట రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏడీఏలు

### ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వొద్దు



రేగొండ, జూన్ 25 : రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయ నాయకుకు వర్తింపజేయొద్దు. పదెకరాల లోపు వ్యవసాయదారులకు అమలు చేయాలి. ప్రభుత్వం సర్వే చేసి అసలైన రైతులను గుర్తించాలి. అంతేకాకుండా సాగులో ఉన్న భూములకు మాత్రమే వర్తింపజేయాలి. ప్రభుత్వం, బంజారు, అటవీ, గుట్టలను పరిగణలోకి తీసుకోవద్దు. అలాంటప్పుడే నిజమైన రైతులకు మేలు జరుగుతుంది. అర్హులందరికీ పథకాలు అందుతాయి.

– సామల పాపిరెడ్డి రైతు, రేగొండ, భూపాలపల్లి జిల్లా

### ఇప్పటికీ రైతు భరోసా అందలె



వర్ధన్నపేట : వానకాలం సీజన్ ప్రారంభమైనా ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇయ్యలేదు. గతంలో వానకాలం పంటల సాగుకు ముందే కేసీఆర్ ప్రభుత్వం సాయం అందించింది. పత్తి, ఇతర పంటలకు దుక్కులను చేసుకొని విత్తనాలు కూడా వేసుకున్నం. వరి సాగుకు కూడా సిద్ధమైతానం. ఇంతవరకు రైతు భరోసా డబ్బులు అందక ఇబ్బంది పడుతానం. ఇగ ఎప్పుడు ఇత్తరు, ఎట్ల పంటలు సాగు చెయ్యాల్నో ప్రభుత్వానికే తెలువాలె.

– భూక్యా, రెడ్యా, ఎన్ఎస్‌తండా, వర్ధన్నపేట





మహబూబాబాద్ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న బలరాంనాయక్

వరంగల్ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కడియం కావ్య

## వరంగల్, మానుకోట ఎంపీల ప్రమాణస్వీకారం

వరంగల్, జూన్ 25(నమస్తే తెలంగాణ)/మహబూబాబాద్ రూరల్ : వరంగల్, మహబూబాబాద్ ఎంపీలుగా ఎన్నికైన కడియం కావ్య, బలరాం నాయక్ మంగళవారం ఢిల్లీలో పార్లమెంట్ భవనంలో ప్రమాణ స్వీకారం చేశారు. కడియం కావ్య అను నేను.. అంటూ తెలుగులో ప్రారంభించి జై భీం, జై భద్రకాళి, సేవ్ కాన్సిట్యూషన్ అంటూ ప్రమాణ స్వీకారం చేశారు. తమ ప్రాంతాలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని, నిరుపేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించాలని ప్రజలు ఆకాంక్షించారు.




ఎంజీఎం దవాఖానలో ప్లకార్డులు చేతబూని ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

## జూడాల నిరసన గళం

- రెండో రోజు కొనసాగిన జూనియర్ డాక్టర్ల సమ్మె
- సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ
- మౌలిక సదుపాయాలు కల్పించాలని నినాదాలు
- వైద్య సేవల్లో అంతరాయంతో రోగుల ఇబ్బందులు

కాశీబుగ్గ, జూన్ 25: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కేఎంసీ ఎదుట జూడాలు కొద్దిసేపు ధర్నా నిర్వహంచారు. అనంతరం ర్యాలీగా ఎంజీఎం దవాఖానకు చేరుకొని ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించాలని ఎంజీఎం దవాఖానలోని గాంధీ విగ్రహం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ వైద్యులకు సకాలంలో ఉపకార వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల క్రితమే తాము రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, వైద్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎమర్జెన్సీ సేవలు మినహా అన్ని రకాల వైద్య సేవలకు తాము దూరంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలల్లో సౌకర్యాలతోపాటు వైద్య సిబ్బందిని నియమించాలని కోరారు. కేఎంసీలో అంతర్గత రోడ్లను బాగు చేయాలన్నారు. అలాగే, సూపర్‌స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్స్ కోసం సవరించిన గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న హాస్టల్ భవనాలు వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, జూనియర్ డాక్టర్ల సమ్మెతో వరంగల్ ఎంజీఎం దవాఖానలో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రి పరిధిలో జూనియర్ డాక్టర్లు, పీజీ వైద్యులు, సూపర్‌స్పెషాలిటీ వైద్య విద్యార్థులు ఎమర్జెన్సీ సేవలు మినహా మిగతా విధులకు దూరంగా ఉన్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందక ఇబ్బంది పడ్డారు. ఓపీ విభాగంలో రోగులు పెద్ద ఎత్తున క్యూలో వేచి ఉన్నారు.




కేఎంసీ ప్రధాన గేట్ ఎదుట ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

## పొలంలో దిగి.. నాట్లేసి

- రైతులతో కలిసి జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వ్యవసాయ పనులు
- సేంద్రియ ఎరువులు వాడాలని సూచన

ఎప్పుడూ పాలనా వ్యవహారాలతో బిజీగా ఉండే జనగామ కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ రైతులతో మమేకమయ్యారు. మంగళ వారం ఉదయం జనగామ మండలం గానుగుపహాడ్ రైతువేదికలో 'రైతునేస్తం' కార్యక్రమానికి వెళ్లి వస్తున్న ఆయన మార్గమధ్యలో వడ్లకొండలో రైతు మారబోయిన బుచ్చిరాములు పొలం వద్ద ఆగారు. పొలంలోకి దిగి మహిళా కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. సేంద్రియ ఎరువులు వేసి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.

- జనగామ రూరల్, జూన్ 25



వడ్లకొండలో వరినాట్లు వేస్తున్న కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా

## మిర్చికి ధర వచ్చె

- తేజ రకం మిర్చి రూ. 19,300, వండర్‌హాట్ ధర రూ. 18 వేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

కాశీబుగ్గ, జూన్ 25: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర భారీగా పెరిగింది. మంగళవారం తేజ రకం మిర్చి రూ. 19,300, వండర్‌హాట్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ. 18 వేలు, 341 రకం మిర్చి రూ. 17 వేల ధర పలికింది. సోమవారం తేజ రకం మిర్చి క్వింటాల్‌కు రూ. 18,800, 341 రకానికి రూ. 15,500, వండర్‌హాట్‌ను రూ. 17,500లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ధర పెరగడంతో కోల్డ్ స్టోరేజీల్లో మిర్చిని నిల్వ చేసుకున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో అతి తక్కువ ధరకు అమ్ముకోలేక కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నందుకు లాభం వచ్చేలా ఉందని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ సీజన్ ప్రారంభంలో 341 రకం మిర్చి క్వింటాల్‌కు అత్యధికంగా రూ. 30 వేలు, కనిష్టంగా 12 వేల ధర పలికింది. అలాగే, వండర్‌హాట్ రకం క్వింటాల్‌కు రూ. 27 వేలు, కనిష్టంగా రూ. 10 వేలకు వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేశారు. అంతేకాకుండా తేజ రకం మిర్చి క్వింటాల్‌కు రూ. 22 వేలు, కనిష్టంగా రూ. 12 వేల ధరకు అమ్ముడుపోయింది.

మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

